క్లుప్తంగా

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు

ఆదోని సెంట్రల్: ఎయిడెడ్ పాఠశాలలో పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ నాయకులు సన్మానించారు. నేషనల్ పాఠశాలలో ఏపీ టీచర్స్ గిల్డ్ జోన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమములో పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులు టి. రత్నం, ఎల్‌కె. చెన్నప్ప, వసంత, కిశోర్, నాగమణిలను సన్మానించారు. కార్యక్రమములో నాయకులు చంద్రశేఖర్, మారెన్న, కేశవయ్య, సిద్దనగౌడ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయ దినోత్సవం



న్యాయవాదులను సన్మానిస్తున్న ఆదోని పట్టణ వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆదోని విభాగ్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ న్యాయ దినోత్సవ వేడుకలు (లాయర్స్ డే) బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ న్యాయవాదులు టి.రవీంద్ర, టి.జి.బాలత్రివేణి, చిన్న ఈరన్నలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. న్యాయవాదుల ద్వారా సమాజానికి ఎన్నో అవసరమైన న్యాయపరమైన ఇబ్బందులు పరిష్కారమవుతాయని ఆదోని పట్టణ వామ్ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో వామ్ అధ్యక్ష కార్యదర్శులు రఘు, సభ్యులు వెంకటేశ్వర్లు, పర్సాద్ రావు, వామ్ మహిళా విభాగ్ అధ్యక్షురాలు వంకదారు మమతాశ్రీ తదితరులు పాల్గొన్నారు

రైలు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



కర్నూలు: కర్నూలు నుంచి అలంపూరుకు వెళ్లే మార్గంలో ధర్మపేట వద్ద రైలు ఢీకొట్టిన ప్రమాదంలో తెలంగాణకు చెందిన సునీల్ (35) తీవ్ర గాయాలపాలయ్యాడు. వ్యక్తిగత పని నిమిత్తం కర్నూలుకు వచ్చిన సునీల్ బుధవారం సాయంత్రం మద్యం సేవించి పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కర్నూలు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

కర్నూలు(అర్బన్): ఆదివాసి, ఎరుకల వీరుడు ఏకలవ్యుడని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వై.రాజు, బీసీ జనసభ నాయకులు టి.శేషఫణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎరుకల హరి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ ఎస్.రామస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, ఉపాధి, సాంకేతిక తదితర రంగాల్లో సమాజం అభివృద్ధి చెందుతున్నా, నేటికి ఎరుకల జాతి అసమానతలకు, అన్యాయాలకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకొని హక్కులు సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు గున్నా మార్కు, ఎరుకల వెంకటస్వామి, మద్దయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి ప్రశంసలు



వై.నాగేశ్వరరావును అభినందిస్తున్న సిక్కిం సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్

కర్నూలు(సెంట్రల్): సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లో జరుగుతున్న ఆలిండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ సమావేశాల్లో డ్రైవర్స్ అసోసియేషన్ సౌత్‌జోన్ అధ్యక్షుడు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావును ఆ రాష్ట్ర సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్ అభినందించారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ మెమొంటోను అందజేసి సత్కరించారు. డ్రైవర్ల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వై.నాగేశ్వరారవు వివరించారు.



ఐరన్‌బండలో పీర్ల ఊరేగింపు



కోసిగిలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్ల దేవుళ్లు



పెద్దకడబూరులో నిప్పులో దూకుతున్న గుమ్మిటమయ్య పీర్లు



కౌతాళం జామియ మజ్జిద్ వద్ద షర్బత్ పంపిణీ

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

గోనెగండ్ల: మొహర్రం వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పెద్దమరివీడు, ఐరన్‌బండ, పెద్దనేలటూర్ తదితర గ్రామాల్లో మొహర్రం పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా పది రోజుల పాటు కులమతాలకు అతీతంగా పీర్లచావిడిల్లో కొలువుదీరిన పీర్ల స్వాములకు ఫాతెహాలు, చక్కెర, టెంకాయలు, కొబ్బెరను సమర్పించి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సరిగెత్తులో భాగంగా రాత్రి పీర్లచావిడీ దగ్గరకు ప్రజలు చేరుకొని సంప్రదాయ బద్ధంగా వేడుకలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున పీర్లను ఊరేగించి తిరిగి చావిళ్లకు చేర్చారు. గోనెగండ్లలో సాయంత్రం సంత మార్కెట్‌లో ప్రజలు పాల్గొని పీర్ల దేవుళ్లను ఏటికి సాగనంపారు. పలువురు వివిధ వేషధారణలలో ఆకట్టుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణయ్య బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

ఎమ్మిగనూరురూరల్: మండలంలో మొహర్రం వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున పెద్దసరిగెత్తు కావటంతో పీర్లను చావిడీల ముందు అగ్నిగుండంలో చుట్టూ తిరుగుతూ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మండల పరిధిలోని కడివెళ్ల, కడిమెట్ల, గుడేకల్, పార్లపల్లి, సోగనూరు, టీఎస్ కూళ్లూరు, కె.తిమ్మాపురం, దైవందిన్నె, పెసలదిన్నె, గువ్వలదొడ్డి, కోటేకల్, బనవాసి, ఎర్రకోట గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



గోనెగండ్లలో పీర్ల దేవుళ్లను ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా మొహర్రం

మంత్రాలయం : మండల పరిధిలో బుధవారం మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. ఏడు రోజుల పాటు పీర్ల చావిడిలో పీర్లు పూజలందుకున్నారు. మొహర్రంలో భాగంగా పీర్లకు ప్రత్యేక పూజలు గావించి ఊరేగింపు నిర్వహించారు. మంత్రాలయం, మాధవరం, మాలపల్లి, చిలకలడోణ, ఖగ్గల్, రాంపురం గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు. యువకులు డప్పు దరువులు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రశాంతంగా వేడుకలు

కోసిగి: మండలంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం సాయంత్రం కోసిగిలో పెద్ద మసీదు సమీపంలో పీర్ల చావిళ్లలో కొలువు తీరిన పీర్ల దేవుళ్లకు కులమతాలకు అతీతంగా ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మేళతాళాలతో ఊరేగింపుగా బయలు దేరాలు. అలాగే సిద్దప్పపాళెంలోని నూరానీ సున్నీ మజిద్, కుమ్మరి వీధిలో సమీపంలోని పీర్ల చావిడీలో కొలువుతీరిన పీర్లు ఊరేగింపు బయలుదేరి. చౌడమ్మ వీధిలో సమీపంలో పీర్ల దేవుళ్లు ఎదురెరుగా వచ్చి కలుసుకొని తిరిగి చావిళ్లకు బయలు దేరి వెళ్లారు. ఊరేగింపులో భక్తులు అడుగడుగునా బిందెల నీళ్లతో పీర్ల దేవుళ్ల పాదాలకు పోసి దర్శించుకుని పూజలు చేసుకున్నారు. యువకులు అలాయి బలాయి ఆడుతూ సాసేన్ సద్దాసేన్ అంటూ ఊరేగింపు ముందుకు సాగింది. తిరిగి చావిడి సమీపంలో చేరుకుని పెద్ద మసీదు సమీపంలోని పెద్ద బావి వద్ద పీర్ల దఫన్ కార్యక్రమం నిర్వహించి మొహర్రం వేడుకలు ముగింపు పలికారు. అలాగే మండంలోని చింతకుంట, పల్లెపాడు, చిన్నభూంపల్లి, మూగలదొడ్డి వందగల్లు, నేలకోసిగి , తుంబిగనూరు, సాతనూరు లతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రశాంతం జరుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుడా ఎస్‌ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. బందోబస్తులో ఏఎస్‌ఐలు నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.



పార్లపల్లి గ్రామంలో అశేష జనం మధ్య పీర్ల ఊరేగింపు



కంబలదిన్ని గ్రామంలో జనసందోహం మధ్య ఊరేగుతున్న పీర్లు



వేషధారణలో గ్రామస్తుల ప్రదర్శన

నందవరం : మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని నందవరం, కనకవీడు, జొహరాపురం, ముగతి, సోమలగూడూరు, నాగలదిన్నె, పొనకలదిన్నె తదితర గ్రామాల్లో వేడుకల్లో భాగంగా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వివిధ వేషధారణలో నందవరం యువకులు డప్పు దరువులు వేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని పీర్లను నిమజ్జనం గావించారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంతో పాటు కంబలదిన్ని, పీకలబెట్ట, హెచ్.మురవణి, కల్లుకుంట, మేకడోణ, చిన్నతుంబళం తదితర గ్రామాలలో మొహర్రం వేడుకలు ఎంతో భక్తితో జరుపుకున్నారు. యువత సావుసేనులో భాగంగా డప్పుల వాయిద్యాలకు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మండల కేంద్రంలోని ఖాదర్‌వలి పీర్లు, గుమ్మటయ్య పీర్లను తెల్లవారి జామున గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం పీర్ల చావిడీ వద్దకు చేరుకున్న తరువాత ఆనవాయితీ ప్రకారం భవిష్యవాణి వినిపించి అగ్ని గుండంలో దూకారు. సాయంత్రం పీర్ల ఊరేగింపు కార్యక్రమం మొదలయ్యింది. రాత్రి స్థానిక పెద్దబావి వద్ద పీర్లును నిమజ్జనం గావించారు. ఎస్‌ఐ మహేష్ కుమార్ బందోబస్తు చేపట్టారు.

ప్రశాంతంగా ముగిసిన మొహర్రం



ఆదోని మండలంలో పీర్ల దేవుళ్లను ఊరేగింపుగా ఏటికి తరలిస్తున్న దృశ్యం,



ముగతిలో ఏటికి తరలివెళ్తున్న పీర్ల స్వాములు

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్, కడితోట, కపటి, సంతెకూడ్లూరు తదితర గ్రామాల్లో బుధవారం మొహర్రం ప్రశాంతంగా వేడుకలు ముగిశాయి. ఉదయం నుంచి పీర్ల దేవుళ్లకు భక్తులు, పీర్లచావిడీల నిర్వాహకులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామపురవీధులగుండా ఊరేగిస్తూ ఏటికి తీసుకెళ్లారు. తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నందవరం: త్యాగనిరతికి ప్రతీకగా హిందూముస్లింలు సమైక్యంగా నిర్వహించిన మొహర్రం వేడుకలు నందవరం మండలంలో ప్రశాంతగా ముగిశాయి. పీర్ల ఊరేగింపు ముందు దువాతో వీరుల త్యాగరిరతిని స్మరించుకున్నారు. మండల కేంద్రం నందవరంతో పాటు ముగతి, నదికై రవాడి, హాలహర్వి, మాచాపురం, నాగలదిన్నె, కనకవీడు, సోమలగూడూరు, పెద్దకొత్తిలి తదిరత గ్రామాల్లో వెండి గొడుగులు, పూలతో అలంకరించి పీర్లను తెల్లవారు జామున మేళతాళలు, తప్పెట్లతో ఊరేగింపుగా ఏటికి తరలించారు. ఆయా గ్రామాల్లో పీర్ల చావిళ్లలో పీర్ల కొలువుదీరి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో బుధవారం పీర్ల జలధి వాసం ప్రశాంతంగా ముగిసింది. ఎస్‌ఐ తిమ్మయ్య పోలీసు బందోబస్తు నిర్వహించారు.



కౌతాళంలో హసన్, హుసేన్ పీర్ల ఊరేగింపు

కొనసాగిన ఆచారం

కౌతాళం: మొహర్రం వేడుకల్లో భాగంగా పదో రోజు దఫన్ కార్యక్రమం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. హసన్, హుసేన్ త్యాగ నిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగలో భాగంగా చాల మంది ఉపవాస దీక్షలు చేపట్టారు. కొంత మంది పీర్ల చావిడీల వద్ద, రచ్చబండల వద్ద మసీదుల వద్ద షర్బత్‌లను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని బదినేహల్, ఉప్పరహల్, ఉరుకుంద, ఎరిగేరి, నదిచాగి, సులేకేరి, బంటకుంట, గుడికంబాలి, చూడి, చిరుతపల్లి, ఓబుళాపురం మల్లనహాట్టి గ్రామాల్లో మోహరం పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. కౌతాళంలో నగార బండీ ఊరేగింపు, లేవడి (బురుగులు పంపిణీ చేసే కార్యక్రమం) జరిగిన తర్వాతనే పీర్ల ఊరేగింపు కార్యక్రమం ప్రారంభమయ్యింది. ముందుగా జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు అన్ని పీర్లు చేరిన తర్వాత ఊరేగింపు ప్రారంభించారు. రాత్రి 8గంటల ప్రాంతంలో కర్బాలా మైదానంలో పీర్లను దఫన్ చేసే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి గట్టి బందోబస్తు నిర్వహించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మంత్రాలయం : మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధి కట్టడికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశించారు. మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధితో గ్రామస్తులు మంచం పట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు గ్రామంలో వైద్య శిబిరం, పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఇప్పుడిప్పుడే గ్రామస్తులు వ్యాధి నుంచి బయటపడుతున్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ గ్రామంలో పర్యటించారు. మంచినీటి బోరు, పరిసరాలు, వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యత యుతంగా పనిచేయాలని, వ్యాధి నివారణకు శక్తివంచన లేకుండా శ్రమించాలని సూచించారు.



మంచినీటి బోరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

న్యాయవాది పార్లపల్లి జయన్న మృతి



జయన్న (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది, మాజీ ప్రభుత్వ ప్లీడర్ జయన్న(51) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఆరోగ్యం విషమించి కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తోటి న్యాయవాదులు సంతాపం తెలిపారు.

న్యాయవాది కుటుంబానికి పరామర్శ

ఎమ్మిగనూరుటౌన్: న్యాయవాది జయన్న మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజారావు, రఘురాం, న్యాయవాది రషీద్‌తో పాటు పలువురు న్యాయవాదులు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామానికి చెందిన హరిజన సుమోతి(31) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. సాయంత్రం గ్రామంలో అందరితో పాటు కూర్చొని ఉండగా ఒక్కసారిగా గుండెలో నొప్పిరావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 15 రోజుల కిత్రం మృతుడి సోదరుడు ఎర్రన్న గుండె పోటుతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఒకే నెలలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 24వ వార్డులో వడ్డె శ్రీను అనే వ్యక్తికి చెందిన గుడిసె అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక బుధవారం ఫోన్ పే ద్వారా ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు తన వంతుగా రూ.20వేలు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు ఇన్‌చార్జ్ రుద్రాక్షాల బజారి బాధిత కుటుంబాన్ని కలిసి ప్రమాద వివరాలు తెలుసుకొని పరామర్శించారు. త్వరలో తమ నాయకురాలు బుట్టారేణుక బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్రసాద్, రసూల్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ఆల్‌ఫ్రెడ్‌రాజు





విక్టోరియాపేటలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో నిల్చొన్న భక్తులు, రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఘనంగా తొలి ఏకాదశి

ఆదోని అర్బన్: ఆషాఢమాసం తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం పాండురంగస్వామి ఆలయాలు హరినామస్మరణంతో మార్మోగాయి. వేకువజామునే ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు రుక్మిణి పాండురంగస్వాముల పాద దర్శనం కల్పించారు. ఇస్వీ రోడ్డులోని శ్రీ నల్లకొండ పాండురంగస్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకుడు అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు పవన్, అశ్వంత్‌లు రుక్మిణి పాండురంగస్వామి వార్లకు పంచామృతాభిషేకం, కుంకుమ, పసుపు అభిషేకం, తులసీపూలు, వెండి అలంకారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదదర్శనం కల్పించారు. సాయంత్రం పల్లకీసేవ, రథోత్సవం కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం, ఇస్వీ రోడ్డులో వెలిసిన శ్రీ నల్లకొండ పాండురంగస్వామి ఆలయాలను తొలి ఏకాదశి సందర్భంగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. స్వామివార్ల దర్శనం అనంతరం ఎమ్మెల్యేకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.



నల్లకొండ రుక్మిణీ పాండురంగస్వామివార్లకు మంగళహారతి ఇస్తున్న అర్చకుడు

జీఓ 117ను రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించిన జీవో నంబర్. 117ను రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం తమ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50,577 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ ఉంటే కేవలం 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి మెగా డీఎస్సీ అనడం సరికాదన్నారు. తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులన్నిటికి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమములో పీడీఎస్‌యూ నాయకులు రమణ, మల్లికార్జున, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: ఆదోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షులు తిప్పన్న, పట్టణ సహాయకార్యదర్శి లక్ష్మన్న, ఏఐటీయూసీ కార్యదర్శి వెంకప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు స్థానిక ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబ జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు.

షరతుల్లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు షరతులు లేకుండా నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతికి సంబంధించి వెంటనే విధి విధానాలు ప్రకటించాలని కోరారు. నగర కార్యదర్శి బీసన్న, నాయకులు సురేంద్ర, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై నేడు అవగాహన ర్యాలీ

ఆదోని రూరల్: పట్టణంలోని 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నుంచి గురువారం ఉదయం 9.30 గంటలకు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు న్యాయవాదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్జీలు, న్యాయవాదులు, డీఎస్పీ, సీఐలు పాల్గొంటారని, హెల్మెట్ వాడకం, రోడ్డు ప్రమాదాల నివారణపై జడ్జీలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.